nipuna
Every Wednesday Free Supplement
05.
21 ఆగస్టు 2024
పేజీలు 8

## ఉత్తమ డాక్యుమెంటరీ

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి దశ ఉద్యమ నేత, దివంగత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన 'యూనిటీ.. ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్' చిత్రం పగెంట్ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ అవార్డుల్లో ఉత్తమ డాక్యుమెంటరీ–2024గా ఎంపికయ్యింది. ఈ విషయాన్ని డాక్యుమెంటరీ రూపకర్తలు జూన్ 13న వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా 400కు పైగా చిత్రాలు రాగా, 38 చిత్రాలను అవార్డు క్యాటగిరీలో ఎంపిక చేశారు. ఈ డాక్యుమెంటరీ నిర్మాత చిరందాస్ ధనుంజయ, డైరెక్టర్ భూదాన్ పోచంపల్లికి చెందిన బడుగు విజయ్ కుమార్.

# అక్షరం.. తొలగిస్తుంది అజ్ఞానం - వెలిగిస్తుంది జ్ఞానం

గ్రూప్–1 ప్రత్యేకం
జనరల్ ఎస్సే



**ప్రశ్న: భారతదేశంలో ప్రాథమిక విద్య**

- భారతదేశంలో సార్వత్రిక ప్రాథమిక విద్యా విధానానికి (Universal Elementary Education) సంబంధించిన ప్రయత్నాలు ప్రాచీన కాలం నుంచి నేటి వరకు వివిధ రూపాల్లో కొనసాగుతున్నాయి. స్వాతంత్ర్యానంతరం నిరక్షరాస్యత నిర్మూలన, విద్యాభివృద్ధికి అనేక రకాల కార్యక్రమాలను అమలు చేసినప్పటికీ జనాభా పెరుగుదల వల్ల దేశంలో నిరక్షరాస్య జనాభా సంఖ్య 1991 వరకు పెరుగుతూ వచ్చింది. 2001 జనాభా లెక్కలు నిరక్షరాస్యుల సంఖ్యలో తగ్గుదలను సూచించాయి.
- 1990 దశాబ్దంలో ప్రాథమిక విద్యా బోధన విస్తరణకు అమలు చేసిన ప్రోత్సాహకాలు, వయోజన అక్షరాస్యత కార్యక్రమం వంటివి అక్షరాస్యత పెంపుదలకు దోహదపడ్డాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్య గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించింది. అదేవిధంగా ఆల్టర్నేటివ్ అండ్ ఇన్నోవేటివ్ ఎడ్యుకేషన్ కేంద్రాలు, ఎడ్యుకేషన్ గ్యారంటీ స్కీమ్ కేంద్రాలు (కుటుంబ పరిస్థితుల వల్ల పాఠశాల విద్యను అభ్యసించలేని బాలబాలికల కోసం) అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. విద్యా సంబంధిత అవకాశాల్లో లింగపరమైన వివక్ష ఎక్కువగా కనిపిస్తుందని యునెస్కో రూపొందించిన గ్లోబల్ మానిటరింగ్ వేదికలో వెల్లడయ్యింది.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో సగటు అక్షరాస్యత 74 శాతం కాగా ఇందులో పురుషుల్లో అక్షరాస్యత 82.1 శాతం, స్త్రీలలో అక్షరాస్యత 65.5 శాతం. దేశంలో అత్యధిక అక్షరాస్యత కేరళలో నమోదవ్వగా అతి తక్కువ అక్షరాస్యత బీహార్‌లో నమోదయ్యింది. ప్రపంచ మహిళల సగటు అక్షరాస్యత కంటే భారతదేశంలో మహిళల అక్షరాస్యత 7 శాతం వరకు తక్కువగా ఉంది.
- బ్రిటిష్ వలస పాలనా కాలంలో భారతదేశంలో ఆధునిక విద్యకు పునాదులు ఏర్పడ్డాయి. స్వాతంత్ర్యానంతరం ఏర్పాటు చేసిన రాధాకృష్ణన్ కమిటీ, కొఠారీ కమిషన్, కస్తూరి రంగన్ నివేదిక వంటి దేశంలో విద్యావ్యవస్థ బలోపేతానికి అనేక విధాలుగా దోహదపడ్డాయి. రాధాకృష్ణన్ కమిషన్ విలువలతో కూడిన విద్యావ్యవస్థకు ప్రాధాన్యం ఇవ్వగా కొఠారీ కమిషన్ ఈ విద్యావ్యవస్థకు అవసరమైన యంత్రాంగాన్ని రూపొందించింది. కొఠారీ కమిషన్ సూచనల మేరకు రూపొందించిన జాతీయ విద్యావిధానం– 1968 విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. విద్యా అవకాశాలను అందరికి సమాన స్థాయిలో అందించడంపై ఈ కమిషన్ దృష్టి సారించింది. సమాజంలో బలహీన వర్గాలకు విద్యను అందుబాటులోకి తేవాలని జాతీయ విద్యా విధానం 1985లో స్పష్టంగా పేర్కొంది.
- దేశంలో విద్యను ఉమ్మడి జాబితాలో చేర్చడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నాయి. 86వ రాజ్యాంగ సవరణ చట్టం (2002) ద్వారా నూతనంగా 21ఎ అధికరణను రాజ్యాంగంలో చేర్చి ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించింది.
- ప్రపంచంలో ఏ ప్రాణికి లేని శక్తి కేవలం మానవులకు మాత్రమే పరిమితమైన గ్రహింపు శక్తి. ఈ శక్తి విజ్ఞాన సముపార్జనవైపు మళ్లడమే విద్య. అక్షరం అంటే నాశనం కానిది అని అర్థం. అక్షర జ్ఞానం ఉంటే జీవిత పరమార్థం తెలుస్తుంది. అజ్ఞానాంధకారాన్ని తొలగింపజేసే అక్షరజ్యోతి కోసం ప్రపంచ సమాజాలు పరితపిస్తున్నాయి. గాలి, నీరు, ఆహారం మాదిరిగా మనిషి కనీస అవసరాల్లో విద్య కూడా ఒక అవసరం. జీవన ప్రమాణాన్ని మెరుగుపరచుకోవడానికి విద్య ఒక తప్పనిసరి సాధనంగా పరిగణించబడింది. అందువల్ల ఐక్యరాజ్య సమితి ఏర్పర్చుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 2030 నాటికి వివక్షకు తావులేని రీతిలో అందరూ విద్యను జీవితాంతం నేర్చుకునే అవకాశాలను కల్పించాలని స్పష్టంగా పేర్కొంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని స్థాయిల్లో విద్యను అందరికి అందుబాటులోకి తెచ్చేందుకు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను సాంకేతికతను విభిన్న రూపాల్లో వినియోగించుకుంటున్నాయి. సమ్మిళిత వృద్ధి సాధనలో విద్య క్రియాశీల సాధనంగా దోహదపడుతుంది. మారుతున్న ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్ల భాష, సాంకేతిక విద్యలకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా విద్యావ్యవస్థలో సమూల మార్పులు జరుగుతున్నాయి.
- ఆర్థిక వృద్ధికి ఉన్నత విద్యకు మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. ఉన్నత విద్యావ్యవస్థకు సంబంధించి భారతదేశంలో ప్రపంచంలో రెండో అతిపెద్ద యంత్రాంగాన్ని కలిగి ఉంది. ప్రపంచంలో యువ జనాభాను ఎక్కువగా కలిగిన భారతదేశం ఈ జనాభాకు ఆధునిక విద్యను అందించగలిగితే ప్రపంచంలో అత్యంత బలమైన మానవ వనరులను కలిగి ఉన్న దేశంగా వెలుగొందనున్నది. దేశంలో దాదాపు మూడున్నర కోట మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో అతి తక్కువ మంది మాత్రమే ఆధునిక ప్రపంచానికి అవసరమైన మానవ వనరులు కలిగి ఉండటం ప్రధాన సమస్యగా ఉంది.
- ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఆర్థిక వనరులను సమీకరించుకోవడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని 2003లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పేర్కొంది. నేషనల్ నాలెడ్జ్ కమిషన్ 2005లో సమర్పించిన నివేదికలో దేశంలో ప్రైవేట్, విదేశీ విశ్వవిద్యాలయాల సంఖ్యను పెంచాలని సిఫారసు చేయడం, ఉన్నత విద్యను సరళీకృతం చేసి ప్రపంచ స్థాయి పోటీని తట్టుకొనే విధంగా ఉండేందుకు ఉన్నత విద్యలో ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాలని 12వ పంచవర్ష ప్రణాళికలో పేర్కొనడం ఉన్నత సంపన్న వర్గాలకు అనుకూలంగా ఉన్నప్పటికీ పేద వర్గాలు మాత్రం ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో అందుకోలేకపోతున్నారన్న వాదన ఉంది. మారుతున్న ప్రపంచ అవసరాల దృష్ట్యా ఇలాంటి సంస్కరణలు అనివార్యం.
- పేదలు అణగారిన వర్గాలు ఎక్కువగా ఉన్న దేశంలో అందరికీ ఉన్నత విద్యను అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అల్పాదాయ, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఆర్థిక, ఆర్థికేతర ప్రోత్సాహకాలను అందించి వారు ఉన్నత విద్యకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. దేశంలో సగటు 11 శాతం మంది విద్యార్థులు మాత్రమే దూర విద్యావిధానం ద్వారా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఉన్నత విద్యను ఎక్కువ మంది విద్యార్థులకు అందుబాటులోకి తేవడానికి సాంస్కృతిక విశ్వవిద్యాలయాలు ప్రధానంగా దోహదపడతాయి. కాబట్టి వీటి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

**ప్రశ్న: ప్రాథమిక విద్య–సర్వశిక్షా అభియాన్**

- ఒక దేశ అభివృద్ధిలో విద్య అత్యంత కీలకమైన సాధనం. దేశంలో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారే క్రమంలో దేశంలో వంద శాతం అక్షరాస్యత, ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు దేశంలోని అన్ని వర్గాలు సమ్మిళిత విద్యలో భాగస్వాములు కావడం అనివార్యం. పేదరికం, బాలకార్మిక వ్యవస్థ, పౌష్టికాహార లోపం, అనారోగ్యం, అవగాహనాలోపం వల్ల అణగారిన వర్గాల పిల్లలు విద్యకు దూరమవుతున్నారు. ఉత్తమ విలువలను ప్రోత్సహించే నాణ్యమైన విద్య కొన్ని వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండటం వల్ల దేశంలోని మొత్తం మానవ వనరులు వినియోగంలోకి రావడం లేదన్న వాదన ఉంది.
- దేశంలోని గ్రామాల్లో సాధారణంగా మూడు రకాల కుటుంబాలు కనిపిస్తాయి. విద్య ప్రాముఖ్యతను గుర్తించి పిల్లల్ని పూర్తిస్థాయిలో చదివించే కుటుంబాలు కొన్ని ఉండగా, విద్యకున్న ప్రాముఖ్యతను గుర్తించినా విద్యాభ్యాసానికి గల అవకాశాలు తెలియని కుటుంబాలు మరి కొన్ని ఉన్నాయి. పిల్లలకు పూర్తి స్థాయిలో విద్యను అందించే స్తోమతను కలిగిలేక, విద్య ప్రాముఖ్యం తెలియక తరతరాలుగా నిరక్షరాస్యులుగా, పేదలుగా మిగిలిపోతున్న కుటుంబాలు అనేకం.
- సత్యాన్వేషణ విద్యకు పరాకాష్ట. జ్ఞాన మార్గంలో అదొక అంతులేని పయనం. మానవత్వ వికాసంలో సరికొత్త దృక్పథాలను ఆవిష్కరించే ప్రస్థానం. ఇందులో సంకుచితత్వానికి, స్వార్థానికి, అసూయా విద్వేషాలకు శతృత్వానికి తావులేదు. విద్య మనిషిని పరిపూర్ణుడిగా విశ్వానికి వెలకట్టలేని సంపత్తిగా తీర్చిదిద్దుతుంది. విశ్వమానవ సౌభ్రాతృత్వం విద్యా విధానానికి వెన్నెముక అవుతుంది. సరైన విద్య మనిషి ఆత్మగౌరవాన్ని, హుందాతనాన్ని పెంపొందిస్తుంది. ప్రతి వ్యక్తి విద్య పరమార్థాన్ని గ్రహించి అన్ని రంగాల్లో అదే స్ఫూర్తితో నడుచుకుంటే భూతలమే స్వర్గమవుతుందని చెప్పడం అతిశయోక్తి కాదు.
- శాస్త్ర సాంకేతిక రంగాల్లో విజ్ఞానం వేగంగా విస్తరిస్తుంది. కొత్త సంస్థల అవసరం పెరుగుతుంది. భవిష్యత్తులో సమాజానికి అవసరమైన సమాచారాన్ని డిజిటల్ గ్రంథాలయాలు అందించనున్నాయి. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ రంగాల్లో పురోగతిని వాడుకునే సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగుపరిచిన విద్యకు అధిక డిమాండ్ ఉంటుంది.
- నైతిక విలువలను పెంపొదిస్తూ సామాజిక ఉపాధిపరమైన అవసరాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పాఠ్యప్రణాళికలు రూపుదిద్దుకోవాలి. నాగరికతల మనుగడకు, వికాసాన్ని నిరంతరం ప్రభావితం చేసే విద్యావిధానానికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం 2001లో ప్రారంభించిన సర్వశిక్షా అభియాన్ లక్ష్యం విద్యా సదుపాయాలు లేని ప్రాంతాల్లో నూతనంగా పాఠశాలలను ప్రారంభించడం అందుబాటులో ఉన్న పాఠశాలల్లో తరగతి గదుల సంఖ్య పెంచడం, తాగునీటి సదుపాయం, వాష్ రూమ్స్ నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం. సర్వశిక్షా అభియాన్ కార్యక్రమంలో భాగంగా జరిగే విద్యాబోధన జిల్లా ప్రాథమిక విద్యా ప్రణాళికల ఆధారంగా స్థానిక సంస్థల భాగస్వామ్యంలో కొనసాగుతుంది. బాలికలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఇతర నిమ్న వర్గాల విద్యావసరాలపై సర్వశిక్షా అభియాన్ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. ఈ కార్యక్రమం అమలు కోసం ప్రధాన మంత్రి అధ్యక్షతన జాతీయ స్థాయి యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు.
- సర్వశిక్షా అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ఈ కార్యక్రమం పురోగతిని తెలుసుకోవడానికి నాలుగంచెల సమీక్ష, పర్యవేక్షణ వ్యవస్థను, 42 జాతీయ స్థాయి సామాజిక శాస్త్ర సంస్థలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా విద్యావిషయక వార్షిక గణాంకాల సేకరణ కోసం ఎంఐఎస్ కంప్యూటర్ ఆధారిత వ్యవస్థను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో అధ్యయన పటిమ స్థాయిని తెలుసుకోవడానికి ప్రతి మూడేండ్లకు ఒకసారి అధ్యయనం చేస్తారు. ఈ కార్యక్రమ ప్రభావం వల్ల ప్రాథమిక విద్యను అభివృద్ధి ఎజెండాలో కీలకమైన అంశంగా పరిగణించడానికి అవకాశం కలిగి ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు నిష్పత్తిని పెంచడం, బ్రిడ్జి కోర్సుల వంటి ప్రత్యామ్నాయ అధ్యయన సదుపాయాలను కల్పించడం. శిశు శిక్షా కేంద్రాలు/ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు వంటి చర్యల వల్ల ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో పాటు దేశ వ్యాప్తంగా విద్య పట్ల జన జాగృతిని కల్పించారు.
- అందరికీ విద్యా లక్ష్యాన్ని సాధించడంలో సర్వ శిక్షా అభియాన్ క్రియాశీల సాధనంగా దోహదపడుతుందని చెప్పవచ్చు. ఈ కార్యక్రమం అమలు వల్ల టీచర్ల నియామకం, పాఠశాల భవనాల నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణం, బోధన–అధ్యయన పరికరాల రూపకల్పన, తల్లిదండ్రులు–టీచర్ల సమావేశాలు, పాఠశాల నిర్వహణలో సామాజిక వర్గాల పాత్ర గణనీయంగా పెరిగి మొత్తంగా దేశంలో ప్రాథమిక విద్యా స్థాయి మరింత మెరుగయ్యిందని చెప్పవచ్చు.
- సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం పాఠశాలలను అందరికీ అందుబాటులోకి తెచ్చింది. వికేంద్రీకృతమై, స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉన్న విధానం వల్ల మారుమూల కుగ్రామాల్లో కూడా పాఠశాలల ఏర్పాటుకు అవకాశం కలిగింది. అదేవిధంగా అడవుల్లో, కొండల్లో, ఇతర సుదూర ప్రాంతాల్లో విద్యా గ్యారంటీ పథకం కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల అందరికీ విద్యా లక్ష్యం సాధించడానికి అవకాశం ఏర్పడింది.
- లింగ, జాతి, కుల, వర్గ తారతమ్యం లేకుండా అందరికీ విద్యను అందుబాటులోకి తేవడానికి బాలలందరూ ఒక్కటే అనే భావన పెంపొందించడానికి కృషి జరుగుతుంది. ఆశ్రమ పాఠశాలలు, వృత్తి విద్యా కేంద్రాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం వంటివి అందరికీ విద్యా లక్ష్యాన్ని సాధించడానికి వివిధ రకాలుగా దోహదపడుతున్నాయి.
- సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం అమలు చేయడం వల్ల గతంలో ఉన్న ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాల సామర్థ్యం పెరగడంతో పాటు బ్లాకు స్థాయిలో, గ్రామ సముదాయాల్లో రిసోర్స్ సెంటర్ల స్థాపనకు దారితీసింది. అందరికీ విద్య అనే బృహత్ లక్ష్యాన్ని సాధించడానికి సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం ఒక సాధనంగా దోహదపడుతుంది.
- సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం అమల్లో భాగంగా టీచర్ల నియామకం, ఉపాధ్యాయ శిక్షణ, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సమగ్ర శిశు అభివృద్ధి కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడం వంటి చర్యలు చేపట్టడం వల్ల ప్రాథమిక విద్యలో గుణాత్మక మార్పులు సంభవిస్తున్నాయి.
- సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం అమలు ప్రభావం వల్ల పాఠశాలల్లో విద్యావిషయక కార్యక్రమాల అమలుపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. విద్యాసంస్థలు, ఉపాధ్యాయ బృందాలు, టీచర్లు ఉత్తమమైన అధ్యయన–బోధనా పరికరాలను రూపొందించడం వంటి చర్యలు చేపట్టడం వల్ల ప్రాథమిక విద్యలో సృజనాత్మకత, నైపుణ్యత వికాసం చెంది దేశంలో ప్రాథమిక విద్య అందరికీ అందుబాటులోకి రావడమే కాకుండా విలువైన మానవ వనరులు వెలుగులోకి రావడం గొప్ప పరిణామం.

**నూతనకంటి వెంకట్**
పోటీ పరీక్షల నిపుణులు
ఆర్గనైజింగ్ సెక్రటరీ
గ్రూప్–1 అధికారుల సంఘం
9849186827

